

డ్రాగా ముగిసిన చిత్తూరు, నెల్లూరు మ్యాచ్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-14 మల్టీ డే మెన్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆరు వికెట్ల నష్టానికి 184 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 66.1 ఓవర్లలో 226 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. చిత్తూరు జట్టులోని తరుణ్ కుమార్‌రెడ్డి 4, రక్షణ సాయి మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చిత్తూరు జట్టు 75.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఆ జట్టులోని పవన్ గోవర్ధన్ 151 పరుగులు చేశాడు. మణిదీప్ 90 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని మౌనిష్, శ్రీచరణ్ చెరో ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 40 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 26 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు ఆధిక్యత సాధించింది.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- నూతన పిహెచ్‌సి ప్రారంభోత్సవంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి- చిట్వేలి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం రూ.1.65 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని అవసరాలను పర్యవేక్షిస్తామని ఎలాంటి సమస్యలు లేకుండా వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. రూపానందరెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలు అన్ని రకాల వసతులు కల్పించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రాధాన్యతని రాబోయే రోజుల్లో వైద్యం కొరకు దూర ప్రాంతాలకు వెళ్లే వారిని దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల సదుపాయాలను సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. వైద్య సిబ్బంది మానవతా దృక్పథంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చైర్మన్ జయప్రకాష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వరలక్ష్మి, పాటూరు శ్రీనివాసరెడ్డి, మండల అధికారులు, సాయివికాస్‌రెడ్డి, రాజు కుంట సర్పంచ్ నరసింహ పాల్గొన్నారు.



పిహెచ్‌సి ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, కుడా చైర్మన్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శిబిరాలు

నందలూరు : రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకోసమే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం జరుగుతోందనికలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నందలూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రతి సోమ వారం పిజిఆర్‌ఎస్‌కు అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జిల్లా వ్యాప్తంగా రాజంపేట, మదనపల్లి, రాయచోటి మూడు డివిజన్‌లలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా ప్రజలు సమర్పించిన ఫిర్యాదులు ఏ స్థితిలో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై స్పష్టత సాధించడం, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా వినడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నాఉ. ప్రతి శాఖ విభాగాధికారికి ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, ఖచ్చితత్వం, పారదర్శకతను పాటించే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భావన, తహ శీల్దార్ అమరేశ్వరి, ఎంపిడిఒ కెఆర్‌ఎం ప్రసాద్, ఇఒఆర్‌డి సునీల్‌కుమార్, ఇతర శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తాం : మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.300 కోట్లతో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు తాగునీటి అందిస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కస్తూరిరాజుగారి పల్లె పంచాయతీ దేవలంపల్లిలో మాజీ డిసిసిబి చైర్మన్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టిడిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రూ.300 కోట్లతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు ఈనెల 11,12 తేదీల్లో సిఎం చేతుల మీదుగా చిన్నమండెంలో శంకుస్థాపన కార్యక్రమం చేపడతామన్నారు. 2027 సంవత్సరం నాటికి రాష్ట్రంలో రాయచోటి నియోజకవర్గాన్ని జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య ఎప్పటికీ తలెత్తుకుండా చూస్తామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మొదటిసారిగా రాయచోటి నియోజకవర్గానికి జలజీవన్ పథకం తీసుకొస్తున్నామన్నారు తద్వారా నియోజకవర్గంలోని 854 గ్రామాలకు గానూ శాశ్వతంగా 300 ట్యాంకులను ఏర్పాటుచేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం శ్రీకారం చూపుతానన్నారు. రోళ్ళ మడుగు నీటిని 50 గ్రామాలకు తాగునీరును అందిస్తామన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి నిధులు దుర్వినియోగం చేయడం వల్ల రాయచోటి నియోజకవర్గ రైతాంగానికి నీటి సమస్య ఏర్పడిందన్నారు. ప్రస్తుతం రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు మండలాల్లోని అన్ని చెరువులకు వెలుగల్లు నీటిని కుడికాల మరమ్మతులు చేయించి నీరు వచ్చేలా చేస్తానన్నారు. మొత్తం రాయచోటి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీటి వసతి కల్పించి సస్యశ్యామలంగా చేస్తానన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో శ్రీకాంత్ రెడ్డి రూ.7కోట్లతో హంద్రీనీవా కాలువ ద్వారా శ్రీనివాసపురం రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టి తన తండ్రి పేరు ఉందనే అనే కారంగానే ఆ రిజర్వాయర్ పనులు జరగకుండా ఆపేశారన్నారు. అనంతరం లకిరెడ్డిపల్లి మండల వ్యాప్తంగా ఉన్నటువంటి పోలిరెడ్డి సుబ్బారెడ్డి అనుచరులు దాదాపు 100 కుటుంబాలు వైసిపి నుంచి మంత్రి సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మదన్మోహన్, రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ ఎర్రగుల్ల పెద్దరెడ్డి యాదవ్, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, షఫీ నాయక్, సింగిల్ విండో ప్రెసిడెంట్ దేవేంద్రారెడ్డి మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ రాధమ్మ

డిసెంబర్‌లోగా బకాయిలు వసూలు చేయాలి : డిపిఒ

ప్రజాశక్తి-పీలేరు

2025-26ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ పన్నుల బకాయిల వసూళ్లను ఈ డిసెంబరులోగా పూర్తి చేయాలని డిపిఒ రాధమ్మ తెలిపారు. బుధవారం పీలేరు మండలం, బోడుమల్లువారిపల్లి పంచాయతీలో క్షేత్రస్థాయి సందర్శన చేసి, అక్కడి సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మేజర్ గ్రామపంచాయతీ అయిన పీలేరులో అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 501 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.17కోట్ల 64 లక్షలు పన్నుల రూపేణా వసూలు కావాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు కేవలం రూ.34 లక్షల పన్నులు మాత్రమే వసూలు అయ్యిందని తెలిపారు. మిగిలిన బకాయిలను డిసెంబర్ నెలాఖరులోగా డిజిటల్ పద్ధతిలో వంద శాతం వసూలుకు సంబంధిత పంచాయతీల కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. ఎవరూ, ఎక్కడా పనులను నగదు రూపంలో వసూళ్ల చేయకూడదని, అలా చేసే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలో స్వామిత్ర కోసం తొలి విడతగా 286 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి, ఇప్పటి వరకు 197 పంచాయతీల్లో క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం పూర్తి చేశామన్నారు. పంచాయతీల్లోని గ్రామ కంఠంలో నిర్మించిన ఇళ్లకు యాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన స్వామిత్ర పథకంలో 35పంచాయతీల్లో ఇళ్ల కొలతలను, సరిహద్దులను గుర్తించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. మిగిలిన పంచాయతీల్లో ఈనెలాఖరుకు జియో ట్యాగ్ పూర్తి చేస్తామని చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించి, ఉన్నతస్థాయిలో సేకరించిన ఇళ్ల కొలతలు సరిహద్దులను అందరికి వివరిస్తారని తెలిపారు. ఇళ్ల వివరాలు, కొలతల సేకరణలో ఏవైనా తప్పులున్నట్లయితే ఇళ్ల యజమానులు సభలో తెలిపితే 21 రోజుల్లో వాటిని సరిదిద్ది 13వ నోటిఫికేషన్ జారీ చేసి ప్రతి ఇంటి యజమానికి ఇంటి హక్కపత్రం మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యదర్శుల సమావేశంలో డిపిఒ మాట్లాడుతూ ఇంజినీరింగ్ సహాయకులు ప్రతిరోజూ నీటి ట్యాంకులను తనిఖీ చేస్తూ, ప్రతి 15 రోజులకు ఓసారి వాటిని శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించి, పిఆర్-వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇందులో ఎవరూ ఎలాంటి అశ్రద్ధ వహించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ నాగరాజ, పీలేరు గ్రామపంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, దొడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి సిగ్మతుల్లా పాల్గొన్నారు.

12న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్ : ప్రభుత్వం ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల12న పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో ఆల్ టూరిస్ట్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, మేక్ మై ట్రిప్, స్విగ్గీ, డాక్టర్ రెడ్డీస్ గ్రో ఇవి, హెటెరో ల్యాబ్స్, మీషో, ఎస్‌బిఐ కార్డ్స్, ఫోన్‌పే, సుగుణ ఫుడ్స్, ముత్తూట్ ఫైనాన్స్, చాతుర్య స్కిల్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తి, ఉన్న యువత ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9553202509 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

లోకేష్‌ను కలిసిన 'మిట్స్' చాన్సలర్

ప్రజాశక్తి-మదనపల్లె



మంత్రి లోకేష్‌తో విజయభాస్కర్ చౌదరి

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్‌టు బి యూనివర్సిటీ వ్యవస్థాపకులు, చాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మిట్స్ యూనివర్సిటీ అందిస్తున్న నాణ్యమైన ఉన్నత విద్య, డిజిటల్ ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల బోధనలో సాధించిన విజయా లను మంత్రి వివరించినట్లు తెలిపారు. ప్రత్యేకించి అధ్యాపకుల నైపుణ్యం, మౌలిక వసతులు, పరిశోధనా అవకాశాల విస్తరణ వంటి అంశాలను వివరంగా తెలియజేసినట్లు చెప్పారు. మిట్స్ సంస్థ స్వయంప్రతిపత్తి (అటానమస్)స్థాయి నుంచి డీమ్డ్‌టుబి యూనివర్సిటీ స్థాయికి ఎదగడం పట్ల సంతోషం మంత్రి నారా లోకేష్ ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు. భవిష్యత్తులో మరింత విద్యా ప్రగతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని మంత్రి తెలిపారని తెలిపారు.

'ఆదిత్య'లో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ దృష్టి ఆస్పత్రి సహకారంతో కళాశాల ప్రాంగణంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది సహా మొత్తం 220మంది ఈ శిబిరంలో నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. అందులో 50 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్. వంశీదర్ రెడ్డి మాట్లాడుతూ యువతలో నేత్ర సంరక్షణపై అవగాహన అవసరం. చిన్న జాగ్రత్తలతో పెద్ద సమస్యలను నివారించవచ్చన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్యంపై, ముఖ్యంగా కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి ఈ సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శం కావాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ఎక్కువ సమయం స్క్రీన్‌ల ముందు గడిపే విద్యార్థులు తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.అరుణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవ ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాభావాన్ని పెంపొందించడం ఎన్ఎస్ఎస్ లక్ష్యమన్నారు. డాక్టర్ అగర్వాల్ దృష్టి ఆస్పత్రి మేనేజర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం మా బాధ్యతన్నారు. కార్యక్రమంలోహెచ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ టి.అమర్నాథ్‌రెడ్డి, అధ్యాపకులు ఈశ్వర్‌రెడ్డి, కళాశాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

- గదులకు తాళాలు వేసి పరారైన స్టాంప్ రైటర్లు
- ఉదయం నుంచి కొనసాగిన తనిఖీలు

ప్రజాశక్తి-రాజంపేట

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి అధికారులు సోదాలు చేపట్టారు. పార్లమెంట్ కేంద్రమైన రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి ఎసిబి అధికారులు సోదాలు చేపట్టారు. ప్రధానంగా గత కొంతకాలం నుంచి రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతి భారీ స్థాయిలో జరుగుతోందని కథనాలు వెలుపడ్డాయి. ఇక్కడ జరుగుతున్న అవినీతిపై అధికారుల దృష్టికి కూడా తీసుకు వెళ్లినట్లు సమాచారం. ముఖ్యంగా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేయడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. గతంలో కూడా ఎసిబి అధికారులు రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. ప్రధానంగా స్టాంపు రైటర్లు, అధికారులు కుమ్మక్కై భారీ స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు కూడా వచ్చాయి. ఒక్కసారిగా ఏసీబీ అధికారులు దాడి చేయడంతో స్టాంపు రైటర్లు గదులకు తాళాలు వేసుకుని పరారయ్యారు. ఉదయం నుండి కొనసాగుతున్న సోదాలపై మీడియా ప్రతినిధులు ఎసిబి అధికారులను వివరణ కోరగా రికార్డులు తనిఖీ చేస్తూ.. పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు. ఈ దాడిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మూడు పువ్వులు ఆరు కాయలుగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ కళకళలాడుతున్న స్టాంప్ రైటర్లు ఒక్కసారిగా ఎసిబి అధికారులు తనిఖీకి రావడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే వారి బాగోతాలు బయటపడతాయని గదులకు తాళాలు వేసుకొని పరారయ్యారు. నిబంధనల ప్రకారం 200 మీటర్ల అవతల స్టాంపు రైటర్లు ఉండాలి. అవేమి పట్టించుకోకుండా దర్జాగా కార్యాలయం చుట్టుపక్కల ఉన్నటువంటి గదులను అద్దెకి తీసుకొని జోరుగా అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వీరిపై కూడా ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మోసపోయి..బిడ్డను కన్న బాలిక

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి- కలకడ

అభమూ శుభమూ తెలియని బాలిక..ఒకరి చేతిలో మోసపోయి గర్భం దాల్చింది. సోమవారం రాత్రి మగబిడ్డను ప్రసవించింది. అన్నమయ్య జిల్లాలో ఈ ఉదంతం చోటు చేసుకుంది. పీలేరు మండల ప్రాంతంలో కలకలం రేపింది. సుండుపల్లె మండలానికి చెందిన బాలిక తల్లిదండ్రులు మూడేళ్ల క్రితం జోవనోపాధి కోసం విదేశానికి వెళ్లారు. బాలిక కంభంవారిపల్లె మండలంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ పీలేరులో చదువుకుంటోంది. కళాశాలకు రాకపోకలు సాగిస్తున్న బాలికను..ఓ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.వి.పల్లె పంచాయతీ అగ్గివారిపల్లెకు చెందిన దినేశ్ పరిచయం చేసుకున్నాడు. మాయమాటలు చెప్పి మోసగించాడు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చింది. బాధితురాలు..రెండు నెలల కిందట వేరే గ్రామంలోని పెద్దమ్మ వద్దకు వెళ్లి, అక్కడ ఉంటోంది. సోమవారం సాయంత్రం కడుపు నొప్పి అని చెప్పడంతో బాలికను సుండుపల్లె పిహెచ్‌సికి పెద్దమ్మ తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసి, బాలికకు పురిటి నొప్పులు వచ్చాయని చెప్పి ప్రసవం చేశారు. మగ బిడ్డ పుట్టాడు. బాలిక పెద్దమ్మ ఫిర్యాదు మేరకు దినేశ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడని కలకడ ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. కాగా ప్రభుత్వాలు మారుతున్న ఇలాంటి నీచ సంఘటనలు మాత్రం ఆగడం లేదంటూ పలువురు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిజిహెచ్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలి

- హెచ్‌డిఎస్ సమావేశంలో చైర్మన్ శ్రీధర్

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్‌డిఎస్ చైర్మన్, కలెక్టర్ శ్రీధర్ సభ్యులను ఆదేశించారు. బుధవారం రిమ్స్ ప్రభుత్వ వైద్యకళాశాల బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన 51వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రజా స్పందనలలో కడప జిజిహెచ్ మంచి ప్రతిభ కనబరచిన డాక్టర్లను అభినందించారు. జిజిహెచ్‌లో అన్ని విభాగాల్లో డాక్టర్లు ఉన్నారని ప్రజలకు మంచి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. కింది స్థాయి సిబ్బంది రోగుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా ఆయా విభాగాల్లో పరికరాల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కేవలం జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాయలసీమ స్థాయిలో కూడా ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సువిశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో మెరుగైన వైద్యసేవలతో వేలాది మంది ప్రజలు ప్రతి నిత్యం ఆరోగ్య రక్షణ కల్పిస్తున్న జిజిహెచ్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్‌డిఎస్ సభ్యులకు సూచించారు. జిజిహెచ్ పరిధిలో ఇప్పటికే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, నేత్ర వైద్యశాల, మానసిక వైద్యశాలలు అందుబాటులో వున్నాయ న్నారు. రాయలసీమలోనే అత్యాధునిక వైద్య సేవలు అందించే మెడికల్ హబ్‌గా వైఎస్ఆర్ జిల్లా జిజిహెచ్ విస్తృత సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం దిశగా జిజిహెచ్ అభివృద్ధి సొసైటీ ముందుకెళుతోందన్నారు. భవిష్యత్తులో జిజిహెచ్‌ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బందిని కోరారు. అనంతరం.. జిజిహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యాధిపతులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయా విభాగాల్లో అవసరమైన వసతులు, సదుపాయాలు, వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అజెండా మేరకు అన్ని విభాగాలలో పూర్తి వివరాలను చర్చించిన అనంతరం జిజిహెచ్‌లో అవసరమైన వైద్య పరికరాల కోసం రూ.3.5 కోట్ల విలువైన పరికరాలను కొనుగోలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఇప్పటికే పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ముందుగా జిజిహెచ్ సూపరింటెండెంట్ రిమ్స్ హాస్పిటల్ ప్రోగ్రెస్‌పై పిపిటి ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. 50వ హెచ్‌డిఎస్ మీటింగ్‌లో తీసుకున్న యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను వివరించారు. సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, రిమ్స్ ఎస్‌డిసి రంగ స్వామి, జిజిహెచ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ జమున, సిఎస్ ఆర్‌ఎంఒ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఎఇఎంఎస్ఐడిసి ఇఇ ఎ.వెంకటేశ్వరరెడ్డి, ఎపివివిపి డిసిహెచ్ఎస్ డాక్టర్ వై.హిమదేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకట రమణమ్మ, హెచ్‌డిఎస్ సభ్యులు, అన్ని విభాగాల వైద్యాధిపతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిజిహెచ్ చైర్మన్ శ్రీధర్

సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు విద్యార్థులు : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ విద్యాశాఖ, సైన్స్ సిటి ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైన్స్ ఎక్స్‌పోజర్, ఎడ్యుకేషనల్ టూర్‌ను నిర్వహిస్తున్నట్లు డిఇఒ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో శాస్త్రీయ ఉత్సుకత, సృజనాత్మకత, ఆవిష్కరణలను పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడో రోజులపాటు ఢిల్లీలో ఈ టూర్ నిర్వహించబడుతున్నట్లు తెలిపారు. ఒక్కొక్క జిల్లా నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బహుముఖ ప్రజ్ఞాశాలు లైన ఇద్దరు విద్యార్థుల చొప్పున మొత్తం 52 మంది విద్యార్థులకు టూర్‌కు అవకాశం కల్పించారన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తరుణ్‌కుమార్ గౌడ్, సంబేపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన యశ్వంత్ కుమార్ రెడ్డిఎంపికయ్యారన్నారు. వీరు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో వివిధ పోటీలలో పాల్గొనడం వల్ల సమగ్ర శిక్ష వీరిని ఎంపిక చేసిందన్నారు. విద్యార్థులకు నాసా ఇంజినీర్లు, స్టెమ్ అధ్యాపకులతో పరస్పర చర్యలు, వర్క్ షాపులు నిర్వహించ బడ తాయన్నారు. వీరికి రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్, కల్చర్, నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం వంటి ప్రసిద్ధ సైన్స్ సంస్థలను సందర్శింప చేస్తారని తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రం నుంచి బయలుదేరి వెళ్లిన ఈ విద్యార్థులకు డిఇఒ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, ప్రధానోపాధ్యాయులు సుంకర రామకృష్ణ, ప్రిన్సిపల్ దిలీప్ కుమార్, అసిస్టెంట్ ఎఎంఒ అసదుల్లా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.



సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు వెళుతున్న విద్యార్థులతో డిఇఒ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఆత్మరక్షణకు కరాటే విద్య : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆత్మరక్షణకు విద్యార్థినిలు కరాటే విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థినుల కోసం బుధవారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సెల్ఫ్ డిఫెన్స్ కరాటే శిక్షణా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ మణిసాయి ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులు చేసిన విన్యాసాలు ఆహుతులను, విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే ఆత్మ రక్షణ కోసం కరాటే విద్యను అభ్యసించాలన్నారు. అనుకోకుండా ఎదురయ్యే సంఘటనలను,ఆపదలను, ఆత్మ విశ్వాసంతో ఎదుర్కోవడానికి కరాటే విద్య ఉపయోగపడుతుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, కరాటేను అభ్యసించడం ద్వారా స్వీయ రక్షణ పొందవచ్చునన్నారు. స్వర్గీయ కరాటే మాస్టర్ ఎఆర్.సురేష్ ఆశయ స్ఫూర్తితో మణిసాయి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు రామిశెట్టి కృష్ణ, ఉపాధ్యాయులు కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

11న వైసిపి నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ పట్టణంలో ఈ నెల 11న వైసిపి ఆధ్వర్యంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించను న్నట్లు ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పట్టణం లోని చెన్నముక్కపల్లి రింగ్ రోడ్డు వద్ద న నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీని నిర్వహించ నున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, నేతలు, అనుబంధ విభాగాలు పెద్దఎత్తున హాజరై ర్యాలీని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



విద్యార్థులకు ఓటు నమోదు దరఖాస్తు అందిస్తున్న అధికారులు

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థులు ఓటు హక్కు పై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జి.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ గల్లా రమణ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ అధ్యక్షతన విద్యార్థులకు ఓటర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువతకు ఓటు హక్కును కల్గి దాని వలన దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం ఉందన్నారు.డిటి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత తప్పని సరిగా ఓటు హక్కు కలిగివుండాలన్నారు. కళాశాల పొలిటిక్స్ లెక్చరర్ డాక్టర్ జి.శ్రీని వాసులు ఓటర్‌గా ఎలా నమోదు చేసుకోవాలో, దానికి కావాల్సిన అర్హతలను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఓటు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దాసరిమోషే, హిస్టరీ లెక్చరర్ డి.వెంకటేశ్వర్లు, బుడుగంటపల్లె విఆర్ఒ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న డాక్టర్ పాల్ రవికుమార్

పట్టణంలోని కజిన్స్ వీధిలోని జీయాన్ ఇఎన్‌టి పాయింట్‌లో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ డిసిహెచ్ఎస్, ఇఎ న్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ పాల్ రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కజిన్స్ స్ట్రీట్ లోని జియాన్ ఇఎన్‌టి పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 23 సంవ త్సరాలుగా తమ సోదరి, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచితమెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ పట్టణ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో చెవి, ముక్కు, గొంతు, తల, మెడకు సంబంధించిన వ్యాధులకు చికిత్సలు, చర్మవ్యాధులు, దంత సమ స్యలు, కేన్సర్‌కు నిష్ణాతులైన వైద్యులచే ఉచిత పరీక్షలు, చేసి, ఉచిత మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7న గాలివీడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 7న మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ చందమౌళీశ్వర్ పేర్కొన్నారు. ఎంపిపి పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కో-ఆప్షన్ నెంబర్, మండల స్థాయి అధికారులు అందరూ సకాలంలో తమ శాఖకు సంబంధించిన నివేదికలతో మండల సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి-కలికిరి

ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యా రంగంలో 35 సంవత్సరాల పాటు ఉపాధ్యాయులుగా సేవలందించిన కలికిరి ఇందిరమ్మ కాలనీ, జడ్‌పి ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) కె.గ్లోరీ స్నేహలత(60) మంగళవారం రాత్రి బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. 1990లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా తన బోధనా జీవితాన్ని ప్రారంభించిన గ్లోరీ స్నేహలత, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ మండలాల్లో విధులు నిర్వర్తించారు. బోధనపై మక్కువ, విద్యార్థుల పట్ల మమకారం కలిగిన ఉపాధ్యాయురాలిగా ఆమె గుర్తింపు పొందారు. ఆంగ్ల బోధనలో ఆమెకు ప్రత్యేక నైపుణ్యం ఉంది. బుధవారం ఉదయం ఆమె మృతదేహాన్ని కలికిరి మండలం సత్యాపురంలోని స్వగృహానికి తరలించగా, బంధువులు, సహచర బోధకులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు ఆమెకు నివాళులు అర్పించారు.

కొలువుదీరిన ఆలయ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని నీరుగట్టువారి పల్లెలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ నూతన కార్యవర్గం బుధవారం కొలువుదీరింది. అధ్యక్షుడిగా బండి సుబ్బరాము, కార్యదర్శిగా బొమ్మిశెట్టి నరసింహులు, కోశాధికారిగా పురం సురేంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మబ్బులేటి వెంకటయ్య, గౌరవ ఉపాధ్యక్షులుగా నార్నవరం రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సహదేవ, రెడ్డిశేఖర్, దొండ్ల శ్రీనివాసులు, టేకులపాలెం శ్రీను, కె.రెడ్డిశేఖర్, కె.కుమార్‌రెడ్డి, ఆర్.రెడ్డి ప్రసాద్, ముత్యాల సుబ్రహ్మణ్యంస్వామి, అనమల మల్లికార్జునలను ఎన్నుకున్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నిస్వార్థమైన సేవలు అందిస్తామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. తమకు ఈ అవకాశం కల్పించిన పెద్దలకు, సహక రించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పురాణం చంద్రశేఖర్, రామిశెట్టి రత్నమయ్య, బండి పవన్‌కుమార్, రామిశెట్టి నీలకంఠ, ఉప్పు రామచంద్ర, రామిశెట్టి కృష్ణ, గుండ్లపల్లి లక్ష్మినారాయణ,మోడెం నాగరాజు, కౌన్సిలర్ ఎం.వి.రమణ, ఉప్పు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో శారీరక విభిన్న ప్రతిభావంతులకు నియోజకవర్గానికి పది చొప్పున మోటారు మూడు చక్రాల వాహనాలు మంజూరు కానున్నాయని అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిసున్నట్లు జిల్లా సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభవంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి అర్.వి. కృష్ణ కిషోర్ బుధవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. అర్హులైన వారు www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25 వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల వయస్సు 25.11.2025 నాటికి 18 నుంచి45 సంవత్సరాల మధ్య ఉండాలిన్నారు. సదరం ధృవీకరణ పత్రం ప్రకారం కాళ్లలో (లోయర్‌లింబ్స్) 70 శాతం కంటే ఎక్కువ వికలత్వం ఉండాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు కంటే ఎక్కువ కాకూడదన్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అభ్యర్థి పేరు మీద ఏమోటరైజ్డ్ వాహనం (2,3 లేదా4చక్రాల) ఉండకూడదన్నారు. సహాయక పరికరముల వాడకుండానే నడవగల వ్యక్తులు అనర్హులున్నారు. వేతనం పొందుతూ కనీసం ఒక సంవత్సర అనుభవం ఉన్నవారు సంబంధిత ధృవీకరణ పత్రం జత చేయాలన్నారు. దరఖాస్తుదారులు దళారులను నమ్మవద్దని, ఎవరూ మధ్యవర్తుల ద్వారా దరఖాస్తు చేయవద్దని తెలిపారు. గతంలో చేసిన దర ఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవని, ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను వితరణగా ఇస్తున్న దాత కృష్ణవేణి

ప్రజాశక్తి-కలికిరి : తన భర్త సుబ్బనారాయణ జ్ఞాపకార్థం కలికిరి టిబి రోడ్డులో నివాస ముంటున్న కృష్ణవేణి పాఠశాలకు కంప్యూటర్ వితరణగా ఇచ్చారు. మండలంలోని వడ్డిపల్లి మండల ప్రాథమిక పాఠశాలకు రూ.22 వేలు విలువగల కంప్యూటర్‌ను విద్యార్థులకు ప్రయోజనం కలగాలని కాంక్షించి తను నెలనెలా పొందే ప్రభుత్వ సామాజిక పింఛను వెచ్చించి ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆమె వితరణ చేశారు. ఈమె ఉన్నత దాతృత్వానికి పాఠశాల తల్లిదండ్రులు, ఎంఇఒ, ఉపాధ్యాయులు ప్రశంసించారు. కార్యక్ర మంలో ఎంఇఒ నాగార్జున, అంగన్వాడీ కార్యకర్త అశ్విని, ఆయా జీవిత, ఎస్ఎంసి సభ్యులు చంద్ర, సుమతి, శ్రీనివాసులు, రెడ్డెమ్మ, రెడ్డప్ప, వెంకటేష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు సేంద్రియ పద్ధతులే మేలు

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి



తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

రైతులు సేంద్రియ పద్ధతులలో వ్యవసాయం చేస్తేనే తుపానుల నుండి పంటలను కాపాడుకోవచ్చునని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. వరుస తుపానులతో జిల్లాలో పంటలకు నష్టాలు వాటిల్లిందని, పంటల రక్షణ కోసం రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాన్ వలన దాదాపు వరి వెన్నుదశ నుండి కోత దశలో ఉన్న పంట ఎక్కువైన నీటి కోతకు గురై, నీరు నిలబడింది, ఆ పొలాల్లోని వరి కర్రలు నేలకు వాలిపోవడం జరిగిందన్నారు. 575 ఎకరాలలో ఈ రకంగా పంట నష్టం జరిగిందని తెలిపారు. వేరుశనగ కూడా కోతకు దగ్గరగా ఉండటం వలన నీరు నిలిచి పొలాలలో ఉన్న కాయలు ఊకుమ్మడి తెగుళ్ళ వ్యాప్తి చెంది దెబ్బతిందన్నారు. కొన్ని పొలాల్లో కాయలన్నీ కూడా కుళ్ళిపోయి నల్లబడి నష్టం వాటిల్లిందన్నారు. కోత దశలో ఉన్న తోట పంటలైన టమాట, మిరప, వాముతి మొదలగు పంటలలో శిలీంద్ర వ్యాధులు ఎక్కువగా సోకింది అలసంద మినుము, పెసర మొదలగు అపరాల పంటలలో పూతరాలి కారణంతో పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈ పరిస్థితులను అధిగమించి పంటల నష్టాన్ని తగ్గించుకోవడానికి రైతులకు కొన్ని సూచనలు అందించారు. వీలైనంత తొందరగా నిలిచిన నీటిని పంటల నుంచి పక్కలకు తీసివేయాలని, సేంద్రియ పద్ధతులలో సాగు చేసిన వరి ఆతర పంటలు తుపాన్ తాకిడికి తట్టుకుని నిలబడతాయన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయానికి మొగ్గు చూపాలని, తుపానుల దాటికి ఉలవ, కంది, ఆముదం పంటలు ఎంత మాత్రమూ దెబ్బ తినలేదన్నారు. ఉలవ లాంటి పంటలను పండించడానికి కూడా రైతులు ముందుకు రావాలని, జూలై నెల రెండవ పక్షంలో విత్తిన వేరుశనగ పంట పూతకు వచ్చే సమయంలో తుపాన్ వాతావరణం నెలకొంటుందని, కాబట్టి జూలై మొదటి పక్షంలోనే వేరుశనగ విత్తడం జరిగిపోవాలన్నారు. శిలీంద్ర తెగుళ్లను తగ్గించుకోవడానికి పూర్తిగా పాడైపోయిన మొక్కలను, వాటి భాగాలను తీసివేసి నాశనం చేయాలని, జీవశిలీంద్ర నాశినులైన ట్రైకోడెర్మా, సూడోమోనాస్లను డ్రిప్ ద్వారా గాని, పిచికారి ద్వారా గాని అందించాలి. తప్పనిసరి పరిస్థితులలో ఈ తేగుళ్లను నివారించడానికి ఒక వంగి సైడు, బ్యాక్టీరి సైడు మిశ్రమాన్ని మొక్కలకు అందించాలని సూచించారు.కార్యక్రమం కెవికె శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం గోడౌన్‌లో జెసి ఆకస్మిక తనిఖీ



రేషన్ బియ్యం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జెసి ఆదర్శరాజేంద్రన్

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో ఉన్న రేషన్ బియ్యం గోడౌన్‌ను బుధవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా పంపిణీకి నిలువ చేసిన గోడౌన్‌లో ఉన్న బియ్యం, పంచదార, పప్పు తదితర నిత్యావసర సరుకులను తనిఖీలు చేసినట్లు తెలిపారు.గోడౌన్‌లో ఉన్న రికార్డులు పరిశీలించి, రేషన్ బియ్యం, పంచదార, తదితర నిత్యవసర వస్తువులు సక్రమంగా ఉండడం పై సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లకు నిత్యావసర సరుకులను సకాలంలో పంపిణీ చేసి, వాటిని ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అని తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి డీలర్ ఆక్రమాలకు పాల్పడకుండా సక్రమంగా ప్రజా పంపిణీ నిత్యవసర సరుకులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎవరైనా డీలర్లు అక్రమాలకు పాల్పడితే వారి డీలర్ షిప్‌ను రద్దుపరిచి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.సంబంధిత అధికారులు డీలర్ షాపులను తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహేశ్వరిబాయి, గోడౌన్ డిటి రమేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా, డిఎపి :ఎఒ

ప్రజాశక్తి-పుల్లంపేట



రైతులకు సూచనలు ఇస్తున్న ఎఒ ప్రవీణ్

మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీలోని దలవాయిపల్లి, దండ్లోపల్లి గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రబీ పంటలలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు క్లుప్తంగా వివరించినట్లు పేర్కొన్నారు. రబీ సీజన్ మినుములు, నువ్వుల పంటలను రైతులు పండించాలన్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. మండలంలోని రైతు సేవా కేంద్రంలో యూరియా, డిఎపి అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, భూమి పాసుబుక్ వివరాలు అందజేసి ఎరువులు తీసుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి మస్తాన్ మాట్లాడుతూ మహిళ సంఘంలోని సభ్యులందరూ కూడా వారి ఇంటి ఆవరణంలో పోషక విలువలు కలిగిన కూరగాయలను పండించుకోవాలని, ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి రైతు కూడా పలు పంటల విధానంలో పంటలు పెట్టుకోవడం వలన అధిక ఆదాయం, భూమి సారవంతం అవుతుందని తెలిపారు. రైతులు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, వీజామృతం పొలాల్లో వాడడం వలన అధిక దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



నిమ్మనపల్లె: రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఐఒమంజుల, ఆలయ నిర్వాహకులు

మండలంలోని శ్రీ నేల మల్లేశ్వర స్వామి దేవస్థానం బుధ వారం భక్తులతో కిటకి టలాడింది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆలయం వద్ద విశేష వేడుకలను ఇఒ మంజుల, రాజన్న, సర్పంచ్ రెడ్డప్ప, ఆలయ తాత్కాలిక పాలకమండలి సభ్యులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు స్వామివారికి నూతనంగా తయారుచేసిన రథంలో శివ, పార్వతి, వినాయక ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయ ంత్రం 6 గంటలకు గాళ్లేయ శిఖరంపై బంగి కృష్ణప్ప చేత జ్యోతి ప్రజ్వలన చేయించి, లక్ష దీపా రాధన కార్యక్రమాన్ని ఆలయం వద్ద జరిపించారు. రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో పాల్గొని పరమేశ్వరునకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద తొలిసారి నిర్మించిన రథోత్సవానికి భక్తులు వేల సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని జయప్రదం చేశారు. కార్తీక పౌర్ణమి కావటంతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. ఆలయాన్ని విశేష విద్యుత్ దీపాలం కరణతో, పూలతో సుందరంగా అలంకరించారు. మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర, పలు పూర ప్రమ ఖులు స్వామివారిని దర్శించుకున్నారు. అనం తరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఆలయం వద్ద ఉదయం నుంచి పెద్దఎత్తున అన్నదాన కార్యక్ర మాలను చేపట్టారు. ఎస్ఐ తిప్పేస్వామి, ట్రైనీ ఎస్ఐ శ్రీధర్ భక్తులకు ఇబ్బం దులకు కలగకుండా బందోబస్తును నిర్వహించా రు. కార్యక్రమంలో ఆలయ తాత్కాలిక కమిటీ రెడ్డిమోహన, సహదేవ, ఎల్లారెడ్డి, అర్చకులు శంకర శాస్త్రి, పోలీసులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** పట్టణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు కార్తీక శోభను సంతరించు కున్నాయి. దేవళం వీధిలోని శ్రీసోమేశ్వర స్వామి ఆలయం, మదికయల్లో ఉండే శ్రీ యోగ భోగేశ్వర స్వామి ఆలయం, అనంతయ్య బంగ్లా వద్ద ఉండే శివాలయం, బర్మావీధిలోని మంజునాథ ఆలయం, వేంపల్లి మల్లయ్యకొండపై వెలసిన శివాలయాల్లో పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని భక్తులు, మహిళలు, భక్తి శ్రద్ధలతో దీపోత్సవం చేపట్టారు. **బి.కొత్తకోట :** మండలంలో శివాలయంలో వైభవంగా కార్తిక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించా రారు. బుధవారం సాయిబాబా ఆలయంలో శేషంరాజు, హరి ప్రసాద్‌రాజు కుటుంబ సభ్యులతో కలిసి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వ్రతం చేయించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి, శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. **కలికిరి:** మండలంలోని ఆలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అన్ని ఆలయాలు కొత్త కొత్త రంగులలో, విద్యుత్ కాంతులతో కొత్త హంగులను సంతరించు కున్నాయి. ముఖ్యంగా శైవ క్షేత్రాలలో మహిళలు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించి, పూజలు నిర్వహించారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, గుండ్రాలులోని చెన్నకేశవ ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. భక్తులను దృష్టిలో పెట్టుకొని ఆలయాల వద్ద పోలీసులు భద్రత ఏర్పాట్లు చేసి సిబ్బందితో పర్యవేక్షించారు.



క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో కరస్పాండెంట్ గురుప్రసాద్

క్రీడల్లో సత్తాచాటిన 'శ్రీజ్ఞానాంబిక' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

ఎస్‌వి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాల అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో శ్రీ జ్ఞానాంబిక కళాశాల విద్యార్థులు అద్వితీయ ప్రతిభ కనబరిచి 15 పతకాలను సొంతం చేసుకుని విశేష కీర్తి సొంతం చేసుకున్నారని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల విభాగంలో టి.సుజిత లాంగ్ జంప్‌లో స్వర్ణ పతకం, వి.రుచిత 100 మీటర్ల పరుగులో బంగారు పతకం, బి. కీర్తన 800, 1500 మీటర్ల రన్నింగ్‌లలో రెండు వెండి పతకాలు, కె.రుక్మిణి జావెలిన్ త్రోయింగ్ విభాగంలో నాలుగు వెండి పతకాలు, నాలుగు రజత పతకాలు సాధించారన్నారు. పురుషుల విభాగంలో పి.మనోజ్‌కుమార్ జావెలిన్ పోటీలో వెండి పతకం పి.పవన్‌కుమార్‌నాయుడు 110 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకాన్ని గెలుచుకున్నారు.ఈ సందర్భంగా మొత్తం 15 పతకాలు సాధించిన పట్ల కళాశాల కరెస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, యస్. రమాదేవి, పిడి శరత్ కుమార్‌నాయక్, పిఇటి జగదీష్ పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం : జెసి

ప్రజాశక్తి-పీలేరు : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా విని వాటిని పరిష్కరించేందుకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర, ఆర్‌డిఒ శ్రీనివాసులు హాజరయ్యారు. బుధవారం కెవిపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ప్రజల నుంచి రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారులకు నేరుగా వినిపించారు. జెసి అధికారులతోనే పలు సమస్యలకు పరిష్కారం కోసం సూచించారు.కొన్ని అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని త్వరితగతిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా జెసి ఆదర్శ రాజేంద్ర మాట్లాడుతూ, ప్రజల అభ్యర్థనలకు తక్షణ స్పందనతో పరిష్కారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి శాఖ ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలిగినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-రాయచోటి

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో జిల్లా స్థాయిలో వ్యాస రచన,వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎస్.రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో జిల్లాలోని 25 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులు 75 మంది పాల్గొన్నారని . జిల్లా స్థాయి లో ప్రథమ స్థానమును కు రాయచోటి బాలికల జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరానికి చెందిన షేక్. అబ్దుల్ మిస్బ, ద్వితీయ స్థానానికి ఎస్. హాప్, తృతీయ స్థానమును గుర్రం కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పి.హారిక జిల్లా స్థాయిలో ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి జోనల్ స్థాయికి పంపినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఇఒ రవీంద్రనాయక్

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-సుండుపల్లె

ఉపాధ్యాయులు సమయం పాటించాలని ఎంఇఒ రవీంద్రనాయక్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ వెనుకబడిన పిల్లల్ని దత్తత తీసుకొని, బోధ నతోపాటు పిల్లలకి మోటివేషన్ తరగతులు చెప్పాలన్నారు. పిల్లల్లో సృజనా త్మక తను పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. యాక్షన్ ప్లాన్‌ను ఇంప్లిమెంట్ చేయాలని, తరగతి వారిగా లర్నింగ్ ఔట్ కమిషన్ అభివృద్ధి పెంచడానికి ఉపాధ్యాయులు మరింత మెరుగైన సుల భతర బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం అమ్మనాయక్, తిమ్మసముద్రం హెచ్ఎం చంద్రశేఖర్, మడితాడు ఉర్దూ హెచ్ఎం హమీదుల్లా, జికె రాజుపల్లి హెచ్ఎం చాంద్‌బేగం, సుండుపల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జక్రియబేగం పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ అందేలా చూడాలి

ప్రజాశక్తి-కలికిరి

రేషన్ డీలర్లు అర్హులందరికీ రేషన్ బియ్యం అందేలా చూడాలని హరికుమార్ రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం మండలంలోని పతేగడ పంచాయతీలోని నగిరిపల్లి, పాలెం, కోటాల గ్రామాల్లోని 20, 22, 23 రేషన్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం స్టాకును తనిఖీ నిర్వహించి, ధరలు సూచిక బోర్డు లను ఏర్పాటు చేయాలని, సమయపాలన పాటించి అర్హులందరికీ బియ్యం అందించాలని, తూకాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు.డీలర్లు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్ఒ దశరథ్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పిడి వెంకటరత్నం

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : పిడి

ప్రజాశక్తి-రామాపురం

వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ద్వామా పిడి వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక సంక్షేమ వంద శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆశయంగా పెట్టుకున్నారని , ఆయన ఆశయాలు నిలబెట్టే విధంగా విద్యార్థులు సన్నద్ధమై భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కష్టపడి ఇష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లాకు మంచి పేరు తీసుక రావాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణుడు , పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన బాస్ శ్రీనివాసులు

- పీలేరును రెవెన్యూ డివిజన్ చేయాలని వినతి

ప్రజాశక్తి-పీలేరు



మంత్రి లోకేష్‌తో శ్రీనివాసులు

పీలేరును రెవెన్యూ డివిజన్ హోదా కల్పించాలని కోరుతూ భారతీయ అంబే ద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. బుధవారం మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆయన మంత్రిని కలిసి ప్రజలు, రైతుల సౌకర్యం, పరిపాలనా సౌలభ్యం కోసం పీలేరు కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి మంత్రి కూడా సానుకూలంగా స్పందించి, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారని తెలిపారు. మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ నడిమికండ్రిగ సుధాకర్ బాబు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సత్యం తుమ్మల ధరణి కుమార్, మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ, కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షుడు దుబ్బ శ్రీకాంత్, డిబిఎస్ఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భాను ప్రకాష్ ఉన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : పదవ తరగతి పబ్లిక్ పరీక్ష నిర్వహించే కేంద్రాలను బుధవారం అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కొండూరు శ్రీనివాసరాజు పరిశీలించారు. మండలంలో పదవ తరగతి మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన రెండు ఎగ్జామ్స్ సెంటర్లు ఏపి మోడల్ స్కూల్ మరియు తంబళ్లపల్లి ఉన్నత పాఠశాలల్లో ఉన్న వసతులను పరిశీలించారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలలో ఉన్నటువంటి మౌలిక సదుపాయాలు తరగతి గదులు, డెస్కులు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు వంటి తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఇఒలు బి.త్యాగరాజు, సిఆర్. నాగసుబ్బరాయుడు, పరీక్షలు నిర్వహించే రెండు కేంద్రాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్, ఎన్ హేమంత్ కుమార్, సూపరిండెంట్ రవి పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం ఢీ : వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధురాలికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకొంది. ములకలచెరువు ఎస్ఐ నరసింహుడు సమాచారం మేరకు..సత్యసాయి జిల్లా గంజాగుంటపల్లికి చెందిన తిమ్మక్క ములకలచెరువు మండలం, కదిరినాయునికోటలో మృతి చెందిన బంధువుల అంత్య క్రియలకు హాజరయ్యేందుకు బయలుదేరినట్లు తెలిపారు. కదిరి నాయునికోట క్రాస్ రోడ్డులో బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వృద్ధురాలిని ద్విచక్ర వాహనం ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. గాయపడిన క్షతగాత్రురాలను ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.